క్లుప్తంగా

ఎమ్మెల్యే పొన్నాడ తక్షణ స్పందన

అమలాపురం టౌన్: 216 జాతీయ రహదారిలో స్థానిక బైపాస్ రోడ్డు వద్ద మోటారు సైకిల్‌పై వెళుతున్న దంపతులు స్పీడ్ బ్రేకర్‌ను దాటుతూ ప్రమాదానికి గురయ్యారు. అదే సమయంలో అటుగా వెళుతున్న ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ప్రమాద స్థలిలో ఆగి గాయాలపాలైన దంపతులను తక్షణమే కిమ్స్ ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం దంపతులిద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

అగ్రిగోల్డ్ బాధితుల వినతి పత్రాలు



ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న అగ్రిగోల్డ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను పరిష్కరించే దిశగా ప్రభుత్వం మరింత కృషి చేయాలని కోరుతూ జిల్లా అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు అమలాపురంలో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, ఇళ్ల వెంకటేశ్వరరావులను బుధవారం వేర్వేరుగా కలిసి వినతి పత్రాలు అందించారు. అసెంబ్లీ సమావేశాల్లో అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను ప్రస్తావించాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు ఆధ్వర్యంలో అగ్రిగోల్డ్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.సురేష్‌కుమార్, కార్యదర్శి శీలం లంకేశ్వరుడు, కోశాధికారి పి.శ్రీరామమూర్తి తదితరులు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను కలిసినవారిలో ఉన్నారు.

మహిళా బిల్లు ఆమోదం ఓ సువర్ణాధ్యాయం



మహిళా బిల్లు ఆమోదంపై విజయోత్సవం జరుపుకుంటున్న జిల్లా బీజేపీ నాయకులు

అమలాపురం టౌన్: లోక్‌సభలో మహిళా బిల్లు ఆమోదం భారతదేశ 75 ఏళ్ల చరిత్రలో ఓ సువర్ణాధ్యాయమని బీజేపీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కస్తూరి అన్నారు. మహిళా బిల్లు ఆమోదంపై జిల్లా బీజేపీ నాయకులు స్థానిక గడియారం స్తంభం సెంటరులో బుధవారం విజయోత్సవం నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా, జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీ ప్రసన్న, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అల్లవరం: మండలంలోని కొమరగిరిపట్నం, అల్లవరం, ఎస్.పల్లిపాలెం, బోడసకుర్రుల్లో ఖాళీగా ఉన్న మొత్తం 5 వలంటీర్ పోస్టులకు స్థానిక అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎంపీడీఓ కృష్ణమోహన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 23వ తేదీ సాయంత్రం 5 గంటల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అక్కినేనికి ఘన నివాళులు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా చేతివృత్తుల సంక్షేమ సంఘ కార్యాలయంలో సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు జయంతి కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత అక్కినేని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం, షేక్ ముల్లాబాబా, గిడ్ల సురేష్, బి.జ్ఞాన రామ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



ఎంపీడీవో కె.వెంకటేశ్వర ప్రసాద్

ఉప్పలగుప్తం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కె.వెంకటేశ్వర ప్రసాద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో శ్రీకాకుళం జిల్లా డ్వామా ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ విజిలెన్స్ అధికారిగా పనిచేసి పదోన్నతిపై మండలానికి వచ్చారు. నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు ఇప్పటివరకూ ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా పనిచేసిన కేవీఎస్ గౌరీకుమారి, పంచాయతీ కార్యదర్శులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అధిక నత్రజనితో చేనుకు చేటు

- తొలకరి పంటకు తెగుళ్ల బెడద
- పంటను ఆశిస్తున్న మాగుడు, ఆకు నల్లి, ఎండు తెగులు, కాండం తొలుచు పురుగు

ఐ.పోలవరం: పంటలకు అధికంగా నత్రజని(యూరియా) వినియోగం వల్ల తొలకరి పంట తెగుళ్ల బారిన పడుతోంది. మాగుడు, ఎండు తెగులు, కాండం తొలుచు పురుగు, ఆకునల్లి ఆశించి పంటకు నష్టం కలగజేస్తున్నాయి. ముమ్మిడివరం నియోజకవర్గంలో ముమ్మిడివరం, తాళ్లరేవు, కాట్రేనికోన, ఐ.పోలవరం మండలాల్లో సుమారు 20 వేల ఎకరాల్లో రైతులు తొలకరి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట దుబ్బుచేసే దశ నుంచి చిరుపొట్ట దశలో ఉంది. ఎరువులకు సంబంధించి నత్రజని అధికంగా ఉండే యూరియాను అవసరమైన మేరకు మాత్రమే వినియోగించాలి. నేరుగా కాకుండా పొటాష్‌తో కలిపి వేయాలి. దుబ్బు బాగా చేస్తుందన్న భావనతో కొందరు రైతులు అవసరానికి మించి యూరియాను నేరుగా వేస్తున్నారు. దీనివల్ల పైరుకు ఎక్కువ రొట్ట చేయడంతో పాటు పొలంలోను, గట్లపై కలుపు పెరిగిపోయి తెగుళ్ల వ్యాప్తికి కారణమవుతుంది. దీనికి తోడు ప్రతికూల వాతావరణంతో ప్రస్తుతం వరి పంటకు మాగుడు, ఎండుతెగులు వ్యాపిస్తున్నట్టు వ్యవసాయాధికారులు గుర్తించారు. నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఆయా తెగుళ్ల లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నియంత్రణ చర్యలు గురించి ఐ.పోలవరం మండల వ్యవసాయ అధికారి ఎం.వాణి వివరించారు.



తెగుళ్ల నివారణకు మందు పిచికారీ చేస్తున్న రైతు

ఆకు నల్లి:
ఎండ ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో ఇది ఆకు అడుగు భాగాన ఉండి రసం పీలుస్తుంది. దీనివల్ల పత్రహరితం, రంగు కోల్పోయి, పసుపచ్చగా పండినట్లు అవుతుంది. దీని నివారణకు నీటిలో కరిగే పొడి గంధకం లీటరు నీటికి మూడు గ్రాములు, లేదా డైమిథైట్(రోగార్) లీటరుకు 2ఎంఎల్, లేదా ప్రొఫినోపాస్ లీటరుకు 2ఎంఎల్ చొప్పున ఆకు మొత్తం తడిచేవిధంగా పిచికారి చేయాలి.

మాగుడు (పొడతెగులు):
ఆకు అడుగుభాగంలో, కాండంపైన లేత బూడిద రంగులో పొడ మచ్చలు ఏర్పడి పైరుపై వరకూ వ్యాపిస్తాయి. తొలి దశలో మచ్చలు లేత బూడిద రంగులో ఉండి క్రమేపీ పసుపు రంగులోకి మారి మొక్క ఎండిపోయినట్టుగా కనిపిస్తుంది. నివారణ కోసం పొలాన్ని సాధ్యమైనంత వరకూ ఆరబెట్టాలి. మాగుడు ఎక్కువగా కనిపించినప్పుడు ఎక్సాకొనోజాల్, లేదా వెలిడామైసిన్ మందు లీటరు నీటికి రెండు ఎంఎల్ చొప్పున ఎకరాకు 200 లీటర్లు మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

ఆకు ఎండుతెగులు:
ఈ తెగులు బ్యాక్టీరియా వల్ల వ్యాపిస్తుంది. ఆకు కొనలు పసుపురంగులోకి మారి ఆకు మధ్య వరకూ వ్యాపిస్తాయి. వర్షాలు కురుస్తున్నప్పుడు నీటి చుక్కల ద్వారా తెగులు సోకిన మొక్కల నుంచి ఆరోగ్యకరమైన మొక్కలకు త్వరగా సోకుతుంది. ఈ తెగులు ఆశిస్తే సాయంత్రం వేళలో వేరే రసాయనాలు ఏవీ కలపకుండా లీటరు నీటికి ఎనిమిది గ్రాముల చొప్పున కలిపి చేనంతా తడిచేటట్టు 200 లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలి. తెగులు ఉధృతంగా ఉంటే తక్షణ నిర్మూలనకు ఎకరాకు కోపర్ హైడ్రాక్సైడ్ (కొసైడ్) 400 గ్రాములు, 100 గ్రాములు ప్లాంటమైసిన్ 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కాండం తొలుచు పురుగు:
ఈ గొంగలి పురుగు ఆకుమడి దశ నుంచి మొదలై పంట కోత వరకూ ఆశిస్తుంది. కాండంలోని అడుగుభాగాన్ని తినేయడం వల్ల మొవ్వు పడిపోయి పిలక చనిపోతుంది. పైరు ఈనిన తర్వాత ఈ పురుగు ఆశిస్తే కంకి తెల్లగా తయారై తెల్లకంకులు ఏర్పడతాయి. నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ పొడర్ లీటరు నీటికి రెండు గ్రాములు, లేదా ఎసిఫేట్ లీటరు నీటికి 1.5 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి.

అవసరం మేరకే ఎరువులు వాడాలి



యూరియాను అధికంగా వినియోగించడం వల్ల కలుపు ద్వారా తెగుళ్లు వ్యాపించి పంటకు నష్టం కలగజేస్తాయి. అందుకే యూరియాతో సహా ఏ ఎరువులైనా అవసరమైన మేరకే వాడాలి. యూరియాను పొలంలో నేరుగా కాకుండా పొటాష్‌తో కలిపి వేయాలి. పొలంలో, గట్లపై కలుపు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
– ఎం.వాణి, వ్యవసాయాధికారి, ఐ.పోలవరం

వైభవంగా మహా గణపతి హోమం



మహా గణపతి హోమాన్ని నిర్వహిస్తున్న అక్షయ పాత్ర ప్రతినిధులు

అమలాపురం టౌన్: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక విద్యుత్ నగర్‌లోని శ్రీ ఆదిశేష నిలయంలో మహా గణపతి హోమం బుధవారం వైభవంగా జరిగింది. అక్షయ పాత్ర ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో అక్షయ పాత్ర ప్రతినిధులు ప్రసాద్ నందు, దొరబాబు, రూప, స్వామి, సంధ్య, నాగ కనకదుర్గ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లరేవు: తాళ్లరేవు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ వి.మాధవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తాళ్లరేవు మండల పరిధిలోని పిల్లంకలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు ఖాళీగా ఉందన్నారు. జార్జిపేట, తోటపేట, కాజులూరు మండలం గొల్లపాలెం, పెనుమళ్ల ఎస్సీపేటలో అంగన్‌వాడీ సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

95 శాతం హామీలను అమలుచేశాం

- ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్
- గోడితిప్పలో గడప గడపకూ మన ప్రభుత్వం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ని అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, శ్రీకాంత్

అల్లవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 95 శాతం ఎన్నికల హామీలను అమలుచేశారని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. మండలంలోని గోడితిప్పలో బుధవారం ఆయన పినిపే శ్రీకాంత్‌తో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ జీజీఎంపీ ద్వారా రూ.20 లక్షలు నిధులే కాకుండా అదనంగా మరో రూ.20 లక్షల నిధులను ముఖ్యమంత్రి మంజూరు చేశారన్నారు. ఆయా నిధులతో తాగునీరు, సీసీ రోడ్లు, తదితర అభివృద్ధి పనులకు ఖర్చు చేయడానికి అస్కారం ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఘన విజయాన్ని అందించాలని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, శ్రీకాంత్‌లు కోరారు. అనంతరం గోడితిప్ప యూపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం పనితీరు, జగనన్న విద్యా కానుక, మౌలిక సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి రామరాజు, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్‌లు చిట్నీడి శ్రీదేవి, రాకాపు విజయలక్ష్మి, బర్రే సీతారత్నం, తిక్కిరెడ్డి శ్రీను, సుందరనీడి సాయి, ఎంపీటీసీలు రాజేశ్వరి, కొనుకు బాపూజీ, తిక్కా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాబు బయటకు వస్తాడన్న గ్యారంటీ లేదు

- పాత్రధారి, సూత్రధారి చంద్రబాబే
- ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్



ఉప్పలగుప్తంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

ఉప్పలగుప్తం: స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో పాత్రధారి, సూత్రధారి చంద్రబాబేనని ఆయన జైలు నుంచి బయటకు వస్తాడన్న గ్యారంటీ లేదని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. మండలంలోని ఉప్పలగుప్తంలో ఆర్సీఎం చర్చి 13వ వార్షికోత్సవ వేడుకలకు బుధవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రూ.371 కోట్ల స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో పక్కా ఆధారాలతోనే చంద్రబాబును అరెస్టు చేశారన్నారు. ముద్రగడ పద్మనాభం కాపు రిజర్వేషన్ కోసం చేసిన పోరాటాన్ని అణచివేసిన చంద్రబాబుకు పవన్‌కల్యాణ్ ఏవిధంగా మద్దతు ఇస్తున్నారో ప్రజలందరికీ తెలపాలని ఎద్దేవా చేశారు. ఫైబర్‌నెట్ కుంభకోణంలోనూ చంద్రబాబు, అతడి కుమారుడు లోకేష్‌లే ప్రధాన ముద్దాయిలుగా ఉండడం ఖాయమన్నారు. చంద్రబాబు తప్పు చేయకపోతే కోర్టులో తన చిత్తశుద్ధిని నిరూపించుకుని బయటకు రావాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజు, జగనన్న సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షుడు పెయ్యిల రమణ, మోటూరి సత్యంకాపు, తొత్తరమూడి బాబులు, చేట్ల విద్యాసాగర్, ఉందుర్తి అంజలరావు, యనమదల పల్లంరాజు, అడబాల మాధవ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్ ఎంపికలు



అమలాపురంలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

అమలాపురం రూరల్: అమలాపురం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 14, 17 విభాగాల్లో బాలికల ఎంపికలు బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ తదితర తొమ్మిది విభాగాల్లో జరిగిన ఎంపిక పోటీల్లో సుమారు 200 మంది బాలికలు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంలు రాజరాజేశ్వరి, విజయకుమారి, పీఈటీ ప్రసాద్, గోవింద్, కుడుపూడి బుజ్జి, సంజీవయ్య, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి తోట రవి తదితరులు పాల్గొన్నారు.

పీడబ్ల్యూడీ సిబ్బంది ధర్నా



నిరసన తెలుపుతున్న యానాం పీడబ్ల్యూడీ సిబ్బంది

యానాం: పీడబ్ల్యూడీ ఎస్ఎంఆర్‌లకు రూ.18 వేల వరకూ జీతాలను పెంచుతున్నట్లు అసెంబ్లీలో ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ గురువారం స్థానిక యానాం పీడబ్ల్యూడీ ప్రధాన కార్యాలయం ఎదుట ఎస్ఎంఆర్‌లు ధర్నా నిర్వహించారు. సమస్యపై గతంలో సీఎం రంగసామి సానుకూలంగా స్పందించారని, కాని ఇప్పటివరకూ హామీని అమలు చేయకపోవడంతో తామంతా తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. ఎన్నో ఏళ్లగా ఎస్ఎంఆర్‌లుగా పనిచేస్తున్న తమను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో ఎస్ఎంఆర్‌లు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సత్యనారాయణమూర్తి సేవలు అభినందనీయం



సత్యనారాయణమూర్తిని సత్కరిస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి తదితరులు

అమలాపురం రూరల్: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పే సత్యనారాయణమూర్తి సేవలు అభినందనీయమని ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్‌గోపాల్ అన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయు అవార్డు అందుకున్న సందర్భంగా సాకుర్రు ఉన్నత పాఠశాలలో బుధవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తిని దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుత్తుల చిరంజీవిరావు, వైస్ ఎంపీపీ పొలమూరి బాలకృష్ణ, ఎంఈవో గుబ్బల సూర్యప్రకాష్, విశ్రాంత ఎంఈవో గోపాలకృష్ణ, హెచ్‌ఎం పి.బాబూరావు, మాజీ ఎంపీపీ పొలవర్తి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం



కేశనకుర్రులో సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ఐ.పోలవరం: గ్రామగ్రామాన మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. మండలంలోని కేశనకుర్రు గ్రామం పొగాకులంకలో రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదల కోసం తీసుకొచ్చిన నవరత్నాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయన్నారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, మండల పార్టీ అధ్యక్షుడు పిన్నంరాజు వెంకటపతిరాజు, ఇందుకూరి రంగరాజు, మోకా రవి, చెల్లి రమాదేవి, కాటం సత్తిరాజు తదితరులున్నారు.

అటల్ మారథాన్‌లో విద్యార్థుల ప్రతిభ



అటల్ మారథాన్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

తాళ్లరేవు: అటల్ మారథాన్ 2022–23లో తాళ్లరేవు హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం జొన్నాడ ఆశాలత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేశ వ్యాప్తంగా నిర్వహించిన 12 వేల ప్రదర్శనల్లో 400 ప్రదర్శనలను ఎంపిక చేయగా తాళ్లరేవు స్కూల్ నుంచి నాలుగు టీమ్‌లు అక్టోబరు 1వ తేదీన ఆంధ్రా యూనివర్సిటీలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాయన్నారు. ఆంధ్రా టెక్ లీగ్ కాంపిటీషన్‌లో 3డీ నిర్మాణ్, యంత్రయాన్, 2 టీములు, చిట్టి ప్రో(రోబోటిక్స్)లో 2 టీములు ఎంపికయ్యాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు దంగేటి నవ్యశ్రీ, అప్పాళ్ల హేమలతతో పాటు ఏటీఎల్ ల్యాబ్ ఇన్‌చార్జ్, గైడ్ టీచర్ పుల్లేటి కోషార్‌లను హెచ్‌ఎం ఆశాలత ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం

యానాం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు మెడికల్ కోర్సులైన ఎంబీబీఎస్, డెంటల్ తదితర కోర్సుల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించే ఫైలుకు ఆమోదం తెలిపినందుకు కేంద్ర ప్రభుత్వానికి గురువారం పుదుచ్చేరి అసెంబ్లీ ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం ఆమోదించింది. స్పీకర్ ఆర్.ఎంబ్లం సెల్వం అధ్యక్షతన జరిగిన అసెంబ్లీ ఒకరోజు సమావేశంలో సీఎం రంగసామి, ప్రతిపక్ష నేత శివ తదితరులు హాజరయ్యారు. చంద్రయాన్–3, జి–20 సమావేశాల విజయవంతం చేసినందుకు కేంద్ర ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించారు. సమావేశంలో యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

అల్లవరం: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని కోరుతూ అల్లవరం మండలం దండోరా నాయకులు జిల్లా సహకార బ్యాంక్ ఆవరణలో బుధవారం రిలే దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో అమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ లూటుకుర్తి చిన్న, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యార్లగడ్డ రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు సవరపు భైరవమూర్తి, యార్లగడ్డ సత్తిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుమర్తి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గణపతికి లక్ష గరిక పూజ



మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో గణపతి

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో కొలువైన గణపతికి బుధవారం గణపతి హోమం, లక్ష గరిక పూజ నిర్వహించారు. గణపతికి ప్రీతికరమైన వివిధ రకాల పండ్లు, గరికతో స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, సర్పంచ్ కాశీ రాజుబాబు, కె.గంగబాబు, ఈఓ మాచిరాజు లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు. గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా మురమళ్ల మాణిక్యాంబ నగర్‌లో వేద స్వస్తి ఘనంగా నిర్వహించారు. చిర్రావూరి శ్రీరామ శర్మ ఆధ్వర్యంలో 30 మంది పండితులు సామ వేదం, రుగ్వేదం, అధర్వన వేదం, యజుర్వేదానికి సంబంధించి నిర్వహించిన వేద స్వస్తి భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

చెత్త శుద్ధీకరణ ప్లాంట్ పరిశీలన



ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తదితరులు

అమలాపురం టౌన్: స్థానిక 29వ వార్డులో డంపింగ్ యార్డ్ వద్ద రూ.2.01 కోట్లతో ఏర్పాటుచేసిన లెగసీ వేస్ట్ ప్రోసెసింగ్ ప్లాంట్ పని తీరును ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు బుధవారం పరిశీలించారు. మున్సిపాలిటీలో చెత్త, తాగునీటి సమస్యల పరిష్కారానికి రూ.2.40 కోట్లతో చేపట్టిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ల నిర్మాణ వ్యయాలకు సంబంధించిన రికార్డులను ఆయన తనిఖీ చేశారు. ఇక నుంచి అటు చెత్త పరంగా ఇటు తాగునీటి పరంగా అధునాతన ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లు అందుబాటులోకి వస్తున్నాయని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, కౌన్సిలర్ గొవ్వాల రాజేష్, కుడుపూడి త్రినాథ్, యనమదల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ కల్పించాలంటూ విన్నపం



అభిప్రాయ సేకరణ జరుపుతున్న జస్టిస్ శశిధరన్ కమిషన్ సభ్యుల బృందం

యానాం: స్థానిక సంస్థలైన మున్సిపాలిటీలు, కమ్యూన్‌పంచాయతీల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు కేటాయించాలని పలువురు యానాం బీసీ సంఘాల ప్రతినిధులు జస్టిస్ శశిధరన్ కమిషన్‌కు విన్నవించారు. గురువారం స్థానిక ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వార్డుల్లో ఓబీసీలకు రిజర్వేషన్ల అమలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ శశిధరన్ మాట్లాడుతూ ఓబీసీ రిజర్వేషన్ల అమలుపై అధ్యయనం చేసేందుకు, అభిప్రాయాల సేకరణకు ప్రభుత్వం తమను నియమించిందన్నారు. ఆయా వర్గాల ప్రతినిధుల సూచనలు, సలహాలు ఇస్తే ప్రభుత్వానికి నివేదిస్తానన్నారు. అభిప్రాయాలను ఈ–మెయిల్ లేదా ఫోన్ ద్వారా తెలియజేయవచ్చన్నారు. స్థానిక శెట్టిబలిజ సంక్షేమ సంఘ నేత గుత్తుల రామారావు మాట్లాడుతూ ఓబీసీలకు రిజర్వేషన్లు కేటాయిస్తే రాజకీయ ప్రాతినిధ్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్ఏఓ ప్రకాశం, సోషల్ వెల్ఫేర్ అధికారి రెయ్యా శ్రీను, బీసీ నేతలు మల్లాడి శామ్యూల్, కాకి నాగేశ్వరరావు, కాదా పవన్, గోపి, దాసరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్ని విధాలా సహకారం



దివ్యాంగ పాఠశాల చిన్నారులకు హాట్‌బాక్స్ అందజేస్తున్న వర్తక సంఘ సభ్యులు

యానాం: దివ్యాంగులకు అన్ని విధాలా సహకారమందిస్తామని సుంకరపాలెం వరసిద్ధి వినాయక వర్తక సంఘ యూనియన్ సభ్యులు ఖండవల్లి నాని పేర్కొన్నారు. స్థానిక ఉమా ఎడ్యుకేషన్ అండ్ టెక్నికల్ సొసైటీ మానసిక దివ్యాంగ ప్రత్యేక పాఠశాలలో జరిగిన జన్మదిన వేడుకల్లో ఆయన పాల్గొని దివ్యాంగ చిన్నారులకు కావాల్సిన 25 లీటర్ల హాట్ బాక్స్‌ని అందజేశారు. కార్యక్రమంలో యానాం లయన్స్ క్లబ్ పిల్లారాయ అధ్యక్షుడు పులవర్తి శ్రీను, నల్లం రాము, యర్రంశెట్టి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం



టి.సావరంలో సీసీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ముమ్మిడివరం: గ్రామీణ ప్రాంతాల్లోని రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని అనాతవరం గ్రామ పంచాయతీ టి.సావరం ఇందిరమ్మ కాలనీలో రూ.80 లక్షలతో నిర్మించనున్న సీసీ రహదారికి ఎమ్మెల్యే పొన్నాడ శంకుస్థాపన చేశారు. తానేలంక గ్రామపంచాయతీలో గోదావరి పాలెం రూ.16 లక్షలతో సీసీ రహదారి, వడ్డెగూడెం వద్ద గ్రావెల్ రహదారి నిర్మాణానికి జిల్లా పరిషత్ నిధులు రూ.5 లక్షలు, రూ.3 లక్షలతో బాలయోగి కాలనీ శ్మశాన వాటికలో షెడ్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కోలా గంగాభవాని, జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శంకరరావు, పెయ్యల చిట్టిబాబు, సర్పంచ్ నక్కా విజయరాణి, జగతా బాబ్జి, బొంతు సత్యశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.